

సోమశిలలో 35.62 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో శనివారం సాయంత్రానికి 35.62 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 4755 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,01,810
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,206
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,482
నవర (8 గ్రాములు)	రూ.75,856

గరిష్టం/కనిష్టం
38.5 /26.9

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శనివారం 47 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

1 నుంచి ముఖ ఆధారిత హాజరు



సమీక్ష నిర్వహిస్తున్న జయలక్ష్మి

వింజమూరు(ఉదయగిరి): రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత హాజరును జూలై ఒకటి నుంచి అమలు చేయనున్నారని ఐసీడీఎస్ గుంటూరు రేంజ్ ఆర్జేడీ జయలక్ష్మి పేర్కొన్నారు. ప్రాజెక్ట్ పనితీరుపై సీడీపీఓ, సూపర్‌వైజర్లతో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులొచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించేలా చర్యలు చేపట్టాలని చెప్పారు. సమయపాలన పాటించడంతో పాటు విధులకు ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆధార్ ఈ – కేవైసీని పోషణ్ యాప్‌లో ఈ నెల 30లోపు నూరు శాతం పూర్తి చేయాలని తెలిపారు. అనంతరం కార్యాలయ అవరణలో మొక్కలు నాటారు. సీడీపీఓ పద్మజకుమారి, సూపర్‌వైజర్లు తేజశ్విని, సుహాసిని, నాగేశ్వరమ్మ, సుజాత, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



యాక్సిడెంట్ జోన్‌ను పరిశీలిస్తున్న మంత్రి ఆనం

ఆత్మకూరు: పట్టణ పరిధిలోని నెల్లూరు – ముంబై జాతీయ రహదారి ఎన్‌హెచ్ – 67పై రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. నెల్లూరు – ముంబై రహదారి నుంచి ఏఎస్‌పేట వెళ్లే అడ్డ రోడ్డు ఆర్చి వద్ద ప్రమాదాలు జరిగిన స్థలాన్ని అధికారులతో కలిసి శనివారం పరిశీలించారు. 20 రోజుల వ్యవధిలో ఒకే ప్రాంతంలో మూడు ప్రమాదాలు సంభవించి, ముగ్గురు మృతి చెందడం బాధాకరమని చెప్పారు. అనంతరం ఆర్ అండ్ బీ అతిథిగృహంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తించిన ప్రాంతంలో వాహనాల వేగాన్ని తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో రూ.ఐదు కోట్ల ఆదాయం దాటిన ప్రధానాలయాల్లో భక్తులకు అన్నప్రసాదాన్ని నాణ్యత ప్రమాణాలతో అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. కామన్ గుడ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు నిధులను ఆలయాల మరమ్మతులు, పునర్నిర్మాణాలకు మంజూరు చేయనున్నామని వెల్లడించారు. ఆర్డీఓ పావని, డీటీసీ చందర్, ఎన్‌హెచ్ డిప్యూటీ మేనేజర్ సుదాన్ష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, తహసీల్దార్ పద్మజాకుమారి, ఆర్ అండ్ బీ ఈఈ, ఏఈలు మురళీకృష్ణ, అమానుల్లాఖాన్, ఇరిగేషన్ ఈఈ రవి, ఏఈ రవికుమార్, డీఎస్పీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చ కండువానా.. ఆల్ రైట్

పచ్చ కండువా కప్పుకొంటే అన్నీ సెట్‌రైట్ అయిపోతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు సర్పంచ్‌లుగా ఉంటే వారి చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ.. అదే పార్టీ మారితే దీన్ని తిరిగిస్తున్న వైనం కోవూరు నియోజకవర్గంలో చర్చనీయాంశమవుతోంది. తాను అవినీతి రహిత పాలనను అందిస్తానని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తరచూ చెప్తున్నా, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. మండల స్థాయి నేతలు, ఆమె చుట్టూ ఉండే మందీమార్బలం అవినీతిని ప్రోత్సహిస్తున్నారు.

వైఎస్సార్సీపీ సర్పంచ్‌గా ఉంటే చెక్‌పవర్ రద్దు

- పార్టీ మారగానే పునరుద్ధరణ
- రేగడిచెలికలో అవినీతికి తమ్ముళ్ల గ్రీన్‌సిగ్నల్
- పొంతన లేని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాటలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: పచ్చ కండువా కప్పుకొంటే పునీతులవుతారంట. కోవూరు నియోజకవర్గంలో అధికార పార్టీ నేతలు అవలంబిస్తున్న తీరును చూస్తుంటే ఇదేదో నిజమనే భావన తలెత్తక మానదు. తమ పార్టీ తీర్థం పుచ్చుకుంటే అవినీతికి పాల్పడేందుకు పచ్చతివాచీ పరుస్తున్నారంటే వారి అరాచకాలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇదో ఉదాహరణ..

పచ్చ నేతల తీరుకు చక్కటి ఉదాహరణగా కొడవలూరు మండలం రేగడచెలిక పంచాయతీనే చూపొచ్చు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్‌గా ఉన్న సమయంలో పంచాయతీ నిధులు రూ.పది లక్షలకుపైగా ఆరగించారని రుజువులు చూపించి చెక్‌పవర్‌ను రద్దు చేయించారు. వెనువెంటనే ఆయన పచ్చ కండువా కప్పుకోవడంతో పాటు స్థానిక షాడో ఎమ్మెల్యేకు కప్పం కట్టేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో ఆయన్ను సచ్ఛీలుడిగా చూపించి రికవరీ లేకుండానే చెక్ పవర్‌ను మంజూరు చేయించారు. ఆపై పంచాయతీలో ఉన్న రూ.కోటిని ఆరగించేందుకు గ్రీన్ సిగ్నలిచ్చారు. తమ్ముళ్లు చెప్పిందే వేదంగా భావించే డీపీఓ తప్పులపై తప్పులు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ అంశాలపై కలెక్టర్ సైతం ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు.

రోడ్ల పేరిట దిగమింగి..

గ్రామంలో ప్రధాన వీధులు, అడ్డ వీధులు పది ఉంటాయి. వీటికి రోడ్లను ఏటా వేశామని చూపి బిల్లులను కాజేస్తున్నారు. వేసిన రోడ్డునే రెండు, మూడు సార్లు చూపి బిల్లులనూ చేసుకున్నారు. సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ప్రజలు నడిచేందుకు గ్రావెల్ వేయకుండానే కనికట్టు చేసి ఎంబుక్‌ను సిద్ధం చేశారని సమాచారం. ఈ ఉదంతం అధికారుల కనుసన్నల్లోనే జరిగిందని తెలుస్తోంది. మరోవైపు డబ్బులు అవసరమైనప్పుడల్లా మోటార్లు కాలిపోయాయనే సాకు చూపి జేబులు నింపుకోవడం సదరు సర్పంచ్‌కు షరా మామూలేనని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.



అప్పు చెల్లించలేదనే కారణంతో స్వాధీనం చేసుకున్న గిరిజనుల నివాసం

భారీగా వెనుకేసుకొని

సర్పంచ్ అవినీతి చిట్టా వెలుగు చూడటంతో చెక్ పవర్‌ను రద్దు చేశారు. అయితే అధికార పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో దీన్ని పునరుద్ధరించారు. సదరు సర్పంచ్ గతంలో జెడ్పీటీసీగా.. ఆయన భార్య ఎంపీపీగా పనిచేశారు. గ్రామాభివృద్ధి కోసం వెచ్చించాల్సిన సొమ్ముతో దగదర్తి మండలం ఊచగుంటపాళెంలో ఇటీవలే పదెకరాలను కొనుగోలు చేయగా, మరో పదెకరాలకు అడ్వాన్స్‌ను ఇచ్చారని సమాచారం. గిరిజనులకు అప్పులివ్వడం.. వడ్డీతో సహా కట్టలేకపోతే ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు సైతం వెనుకాడరని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



రేగడిచెలిక పంచాయతీ కార్యాలయం

నీరుగారుతున్న విచారణ

మరోవైపు సర్పంచ్ అవినీతి బాగోతంపై కలెక్టర్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేయగా, విచారణ జరపాల్సిందిగా కావలి డీఎల్పీఓను ఆదేశించారు. అయితే దీన్ని నీరుగారుస్తున్నారని తెలుస్తోంది. అవినీతి స్పష్టంగా కన్పిస్తున్నా, డీఎల్పీఓ నోరు మెదపకపోవడం ఈ వాదనకు బలం చేకూరుస్తోంది.

అక్రమాలకు మచ్చుతునకలు..

- రేగడిచెలికలో సీమెన్స్ గమేసా, ఇఫ్కో కిసాన్ సెజ్, క్రెబ్స్ తదితర పరిశ్రమలున్నాయి. దీంతో ఈ పంచాయతీకి సాధారణ నిధుల కింద రూ.70 లక్షలొస్తాయి. వీటితో గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేయొచ్చు. అయితే దీనికి భిన్నంగా తన వ్యక్తిగత అభివృద్ధిపైనే సర్పంచ్ దృష్టి సారించారు.
- గ్రామంలో శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.11 లక్షలను కేటాయించగా, ఇక్కడ రూ.నాలుగు లక్షల్లోపే పనులు జరిగాయని తెలుస్తోంది.
- గ్రామంలో డ్రైనేజీ కోసం తవ్విన మట్టిని దేవాలయానికి నాలుగు వైపులా.. పంచాయతీకి నాలుగు వైపులా తోలారు. ఈ మట్టిని బయటి నుంచి కొనుగోలు చేసి రవాణా జరిపామనే రీతిలో దొంగ బిల్లులను సృష్టించి రూ.12 లక్షలను కొల్లగొట్టారనే ఆరోపణలూ ఉన్నాయి.
- పంచాయతీలో తాగునీటి బోర్లు కాలిపోయాయని చూపుతూ, గడిచిన ఐదేళ్లలో రూ.40 లక్షల వరకు స్వాహా చేశారని సమాచారం. వీటిని కొనుగోలు చేసిన బిల్లులెక్కడో.. పాత బోర్లను ఎక్కడ ఉంచారో పెరుమాళ్లకే ఎరుక. పాత వాటికి వేలం వేయకుండా.. కొత్త బోర్లను ఏర్పాటు చేయకుండానే నిధులను దోచేశారని గ్రామస్తులే ఆరోపిస్తున్నారు.



కొనుగోలు చేసిన భూమి వివరాల పత్రాలను చూపుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఎలాంటి రుజువుల్లేకుండానే ఆరోపణలా..?

- ఆక్రమించాల్సిన అవసరమే లేదు
- వీరిపై కోర్టును ఆశ్రయిస్తా
- అహోబిలం మఠం భూములపై మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కనుపర్తిపాడు పరిధిలోని సర్వే నంబర్ 295లో గల భూమి అహోబిలం మఠానికి చెందిందనే రెవెన్యూ రికార్డులు వారి వద్ద లేవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మినీబైపాస్‌లోని తన నివాసంలో విలేకరులతో శనివారం ఆయన మాట్లాడారు. రుజువులుంటే కలెక్టర్ వద్దకెళ్లడమో లేక న్యాయస్థానాలను ఆశ్రయించాలే గానీ ఆశ్రమంలో ఎక్కడో రాసి ఉందనే అంశాన్ని పట్టుకొని తన వద్దకొచ్చి డబ్బులు అడగడం న్యాయం కాదని పేర్కొన్నారు. గతంలో తనను అహోబిలం మఠం సెక్రటరీ వరదరాజన్ కలిశారని, ఏమైనా రుజువులుంటే తీసుకొస్తే పరిశీలిస్తానని చెప్పిన అంశాన్ని గుర్తుచేశారు. తనపై రెండు రోజులుగా నిరాధార ఆరోపణలు చేస్తుండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ పత్రాలను సృష్టించి పొలం వద్ద బోర్డు పెట్టారని ఆరోపించారు. తహసీల్దార్ ప్రకటన చేయడం.. పొలం వద్దకు వీఆర్వో నేరుగా వెళ్లి.. ఇది వేరొకరిదనేలా బోర్డు నాటి ఫొటోలు తీయించుకోవడాన్ని ఇప్పటి వరకు ఎక్కడా చూడలేదన్నారు. ఎలాంటి నోటీసులివ్వకుండానే ఇలా వ్యవహరించారని చెప్పారు. సర్వే నంబర్ 295లోని ఈ పొలాన్ని 2007లో మురళీకృష్ణంరాజు, కిలారి రమేష్‌బాబు తదితరులు తనకు విక్రయించారంటూ డాక్యుమెంట్లను ప్రదర్శించారు. 1954 నుంచి నేటి వరకు లింక్ డాక్యుమెంట్లు పక్కాగా ఉన్నా, ఎవరి ప్రోద్బలంతోనో అధికారులు తప్పుడు సమాచారాన్ని సృష్టించి తన ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారని చెప్పారు. వీఆర్వో, అహోబిలం మఠం సెక్రటరీ వరదరాజన్, తన ప్రతిష్టను దెబ్బతీసేలా సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై న్యాయస్థానంలో కేసు వేస్తానని స్పష్టం చేశారు. ఫిర్యాదును పోలీసులు స్వీకరించలేదని, అందుకే కోర్టును ఆశ్రయించాల్సి వస్తోందన్నారు. వేరొకరి పొలాలను ఆక్రమించాల్సిన అవసరం తనకు లేదని చెప్పారు. నెల్లూరు చెరువు, కనుపర్తిపాడు, పొదలకూరు రోడ్డు, నగర శివారు ప్రాంతాల్లో అనేక ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వీటిని స్వాధీనం చేసుకొని ఇల్లు లేని పేదలకు పంచాలని హితవు పలికారు. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నేతలు స్వర్ణా వెంకయ్య, పాశం శ్రీనివాస్, హరిబాబు యాదవ్, ఏసునాయుడు, మల్లు సుధాకర్‌రెడ్డి, మొయినుద్దీన్, శ్రీధర్‌బాబు, ఆగాల శ్రీనివాస్‌రెడ్డి, సందానీబాషా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

పొదలకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా మేమున్నామని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత భరోసా ఇచ్చారు. మండలంలోని చెన్నారెడ్డిపల్లికి చెందిన పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీపీ నోటి మాలకొండారెడ్డి అనారోగ్యానికి గురికావడంతో ఆమె శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్న అనంతరం ఆమె మాట్లాడారు. తన తాత కాకాణి రమణారెడ్డి అనుచరుడిగా మాలకొండారెడ్డి ఉంటూ విలువలతో కూడిన రాజకీయాలు చేశారని తెలిపారు. కూటమి ప్రభుత్వమొచ్చాక సర్వేపల్లి నియోజకవర్గంలో పదుల సంఖ్యలో అక్రమ కేసులను బనాయించారని ఆరోపించారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, తమ కుటుంబంతో పాటు గోవర్ధన్‌రెడ్డి అభిమానులు, కార్యకర్తలు అండగా నిలుస్తారని చెప్పారు. ప్రజా బలం ముందు అక్రమ కేసులు నిలబడవని తెలిపారు. తన తండ్రిపై బనాయించిన కేసులన్నీ వీగిపోయి తిరిగి ప్రజాసేవలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలోని నేతలు వెల్మిరెడ్డి సుబ్బారెడ్డి, కోడూరు ఆనందరెడ్డి నివాసాలకెళ్లి యోగక్షేమాలను ఆరాతీశారు. సొసైటీ మాజీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, మాజీ ఎంపీపీ కోనం చినబ్రహ్మయ్య, ఎంపీటీసీలు కేతు రామిరెడ్డి, సుబ్బరత్నమ్మ, శ్రీనివాసులు, అంజద్, నేతలు నోటి బాలకొండారెడ్డి, కోడూరు మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాలకొండారెడ్డిని పరామర్శిస్తున్న పూజిత

ఆరోగ్య యోగం



యోగా చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నెల్లూరులో అట్టహాసంగా శనివారం నిర్వహించారు. ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో పెద్ద సంఖ్యలో యోగా విన్యాసాలు చేశారు. వన్ ఎర్త్.. వన్ హెల్త్ నినాదంతో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్ మాట్లాడారు. జిల్లాలోని ఏడు వేల ప్రదేశాల్లో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 11 లక్షల మంది నమోదు చేసుకున్నారన్నారు. యోగా జీవన విధానంలో భాగం కావాలన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు వ్యాఖ్యాతగా, క్రీడాభివృద్ధి సంస్థ అధికారి యతిరాజ్ నోడల్ అధికారిగా వ్యవహరించారు. అవెన్యూ స్కూల్ విద్యార్థినులు సహస్ర, లయశ్రీ, జనన్య తదితరులు నిర్వహించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కో ఆర్డినేటర్ ప్రసన్న కుమార్, శిక్షకులు సెలీనా, అరుణ సుకన్య, శైలజ, పద్మజ, ప్రసూన, గాయత్రి, ప్రసన్న తదితరులకు జ్ఞాపికలను అందజేశారు. ఎస్పీ కృష్ణకాంత్, జేసీ కార్తీక్, కమిషనర్ నందన్, డీఆర్వో ఉదయభాస్కర్, ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏయ్.. మమ్మల్నే ప్రశ్నిస్తారా

ప్రజాస్వామ్యంలో తమ గళాన్ని స్వేచ్ఛగా వినిపించే హక్కును రాజ్యాంగం కల్పించింది. దీనికి భంగం కలిగించేలా ఎవరు వ్యవహరించినా శిక్షార్హులేననే విషయాన్ని కూటమి ప్రభుత్వం విస్మరిస్తూ.. పౌరుల హక్కులను కాలరాస్తోంది. ప్రశ్నించే వారిపై ఉక్కుపాదాన్ని మోపి పైశాచికానందాన్ని పొందుతోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడమే నేరమనే రీతిలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులను బనాయిస్తోంది. అధికారం ఉందనే ధీమాతో పోలీసులను ఉసిగొల్పి తీవ్రంగా వేధిస్తోంది.

- భావప్రకటన స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వ ఉక్కుపాదం
- వైఎస్సార్సీపీ శ్రేణులే లక్ష్యంగా స్కెచ్
- అక్రమ కేసులతో వేధింపులు
- కావలిలో శ్రుతిమించుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: ప్రతిపక్ష నేతలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఫిర్యాదు అందడమే తరువాయిగా కనీస విచారణ జరపకుండానే కేసులు నమోదు చేసే పనిలో పోలీసులు తలమునకలై ఉన్నారు. ఈ తరహా పరిస్థితులు కావలిలో మరింత శ్రుతిమించాయి. రెడ్‌బుక్ రాజ్యాంగ అమల్లో ఖాకీలు పరిధి దాటి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కేసుల విషయంలో అత్యున్నత న్యాయస్థానాలు మందలిస్తున్నా, వీరికి ఏ మాత్రం పట్టడంలేదు. ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలపై టీడీపీ, జనసేన నేతలతో పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేయించి కేసుల పేరిట వేధింపులకు గురిచేస్తున్నారు.

కావలిలో ఇదీ తీరు..

- పైలాన్ ధ్వంసం కేసులో 12 మందిపై నాన్‌బెయిలబుల్ కేసును కావలి రెండో పట్టణ పోలీసులు నమోదు చేసి నలుగుర్ని అరెస్ట్ చేశారు. ఎనిమిది మందిలో ఐదుగురు ముందస్తు.. మరో ముగ్గురు ఇంటర్నల్ బెయిల్ పొందారు.
- దగదర్తిలో టీడీపీ నేత తన స్నేహితులతో కలిసి వ్యవసాయ భూముల్లో గల గెస్ట్‌హౌస్‌లో మందు పార్టీ చేసుకున్నారు. ఈ ఫొటోలు ఓ సోషల్ మీడియా గ్రూపులో వచ్చాయి. వాటిని ప్రభావతి.. ఇతరుల వాట్సాప్ గ్రూపుల్లోకి ఫార్వార్డ్ చేశారనే కారణంతో ఆమెపై కేసు నమోదు చేశారు.
- సోషల్ మీడియాలో వీర రఘు, శ్రీనివాసులు, ఎం శ్రీనివాసులు, మాచర్ల సుందరరాజు యాక్టివ్‌గా ఉంటారు. ప్రభుత్వ వైఫల్యాలపై మీడియాలో వచ్చిన కథనాలు, పోస్టులను ఫార్వార్డ్ చేస్తున్నారంటూ వీరిపై పోలీసులకు కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిపై పలు కేసులు నమోదయ్యాయి.



- ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వార్డ్ చేస్తున్నారంటూ కావలి పట్టణంలోని 11వ వార్డుకు చెందిన సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఆత్మకూరు రాజేష్‌పై టీడీపీ నేతల ఫిర్యాదుతో రెండు కేసులను పోలీసులు నమోదు చేశారు. ఓ కేసులో స్టేషన్ బెయిల్ మంజూరు కాగా, మరో దాంట్లో రిమాండ్‌కు వెళ్లారు.
- సోషల్ మీడియా యాక్టివిస్ట్ దామెర్ల శ్రావణ్‌కుమార్‌పై కావలి పోలీసులు రెండు, ఒకటో పట్టణ పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు. రెండు కేసుల్లో బెయిల్ మంజూరుకాగా, మరో అంశంలో రిమాండ్‌కు వెళ్లారు.
- సోషల్ మీడియా యాక్టివిస్ట్ బెహరా లక్ష్మీనారాయణపై కావలి ఒకటి, రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. రెండు కేసుల్లో బెయిల్ మంజూరైంది.
- వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పరుసు మాళీశంకర్‌పై కావలి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్లో కేసును ఇటీవల కేసు నమోదు చేయగా, బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు.
- బోగోలు మండలం కడనూతలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలపై మారణాయుధాలతో దాడి చేశారు. అయితే తిరిగి ఆ పార్టీ నేత బాబుతో పాటు మరో ఏడుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- ఏఎంసీ మాజీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును పది రోజుల క్రితం నమోదు చేశారు.
- విజయదుర్గ హోటల్‌కు తాళాలేశారంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిపై కావలి రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరికి స్టేషన్ బెయిల్‌ను మంజూరు చేశారు.

క్లుప్తంగా

కాల్ సెంటర్ ఏర్పాటు


ఆనంద్, కలెక్టర్

నెల్లూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి వినతుల సమాచారం ప్రజలు తెలుసుకునేందుకు కాల్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆనంద్ శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజనల్ స్థాయిలో వినతుల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు తమ అర్జీ పరిష్కారం కాకున్నా, ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకునేందుకు 1100 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలియజేశారు.

నెల్లూరులో యువత పోరు రేపు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఈనెల 23వ తేదీన జరగబోయే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున శనివారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3 వేలు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి మోసం చేసిందన్నారు. 23న పాత జెడ్పీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు యువత, నిరుద్యోగులతో కలిసి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు.

ఎస్‌ఎస్‌సీ నోటిఫికేషన్ జారీ

నెల్లూరు రూరల్: భారత ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థల్లోని వివిధ గ్రూప్ బీ, సీ పోస్టులకు ప్రత్యక్ష నియామకం కోసం ఓపెన్ కాంపిటేటివ్ కంప్యూటర్ ఆధారిత పరీక్షను నిర్వహించడానికి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ ఎగ్జామినేషన్ 2025 నోటిఫికేషన్ జారీ చేసిందని కలెక్టర్ ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల వివరాలు, వయో పరిమితి, అవసరమైన విద్యార్హత, చెల్లించాల్సిన రుసుం, పరీక్ష పథకం, దరఖాస్తు చేసుకునే విధానం తదితర వివరాల కోసం కమిషన్ ssc.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. జూలై 4వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తులను సమర్పించాలన్నారు. పరీక్ష ఆగస్టు 13 నుంచి 30వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఎస్సైల బదిలీలు

నెల్లూరు(క్రైమ్): జిల్లాలోని పలువురు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ జి.కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరు ఎస్సై కె.కిశోర్ బాబును వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న ఎ.శ్రీనివాస రెడ్డిని అల్లూరుకు, కావలి రెండో పట్టణ ఎస్సై ఎన్.ప్రభాకర్‌ను బిట్రగుంటకు, బిట్రగుంట ఎస్సై కె.భోజ్యానాయక్‌ను వీఆర్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్.కోటయ్యను కలువాయి పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు.

బైక్ అదుపుతప్పి..

- యువకుడి మృతి

మర్రిపాడు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. మర్రిపాడు పోలీసుల కథనం మేరకు.. ఏఎస్‌పేటు చెందిన షేక్ సమీర్ (18) మర్రిపాడు మండలంలోని డీసీపల్లి మజారా ఖాన్ సాహెబ్ పేట గ్రామంలోని దర్గాకు శుక్రవారం అర్ధరాత్రి బయలుదేరాడు. ఖాన్‌సాహెబ్‌పేట గ్రామానికి వచ్చేసరికి టర్నింగ్ వద్ద బైక్ అదుపుతప్పగా సమీర్ కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన సమీర్‌ను ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ


స్వామి, అమ్మవార్లను తీసుకొస్తూ..

రాపూరు: మండలంలోని పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులను అలంకార మండపంలో తిరుచ్చిపై కొలువుదీర్చారు. ఆభరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్‌సేవను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం నిత్య కల్యాణ మండలపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని జరిపారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

విదేశాలకు ఉలవపాడు మామిడి

అమెరికా, యూకేకు ఎగుమతి | 10 టన్నుల పైనే..



ప్రసిద్ధి చెందిన ఉలవపాడు మామిడి విదేశీయులను సైతం నోరూరిస్తోంది. ఈ ఏడాది కూడా ఉలవపాడు బంగినపల్లి రకం మామిడి అమెరికా, యూకేలకు ఎగుమతి చేస్తున్నారు. ఉలవపాడులోని బీ ష్యూర్ అగ్రి ఎక్స్‌పోర్ట్స్ ఆధ్వర్యంలో ఈ రెండు ప్రాంతాలకు పంపారు. బెంగళూరులోని క్వాలిటీ తనిఖీ కేంద్రంలో పరీక్షించి నాణ్యతగా ఉన్న కాయల్ని విదేశాలకు పంపుతున్నారు. ఈ ఏడాది సుమారు 10 టన్నుల పైనే ఎగుమతయ్యాయి. బంగినపల్లి రకం కవర్ కట్టిన కాయలు కేజీ రూ.140, కవర్ కట్టని కాయలు కేజీ రూ.100 చొప్పున రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి తరలిస్తున్నారు.

– ఉలవపాడు


విదేశాలకు తరలిచేందుకు సిద్ధం చేసిన ఉలవపాడు మామిడి కాయలు



బెంగళూరులో క్వాలిటీ చెక్ చేయిస్తున్న సంస్థ ప్రతినిధులు

నాణ్యతే కీలకం

విదేశాలకు ఎగుమతి చేసే వాటిలో నాణ్యతే ప్రధానం. కాయలను ముందుగా కోసిన తర్వాత వాటిలో తేమ ఇంకే వరకు తిరగబెట్టి ఉంచాలి. అనంతరం మచ్చలేకుండా ఉన్న కాయలను ఎంచుకోవాలి. తియ్యదనం కూడా కాస్త తక్కువగా ఉండాలి. కవర్ కట్టిన కాయల్లో వడగాలి, ఎండ తగలదు కాబట్టి తీపి శాతం తక్కువగానే ఉంటుంది. కానీ కవర్ కట్టని కాయలనే విదేశాల్లో ఉన్న భారతీయులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఇలా గ్రేడింగ్ అయిన కాయలను బెంగళూరులోని క్వాలిటీ కంట్రోల్లో తనిఖీ చేస్తారు. నాణ్యమైన రకంగా గుర్తించిన వాటిని విమానాల్లో విదేశాలకు ఎగుమతి చేస్తారు. అక్కడ హన్స్‌లెట్‌లోని జీటకారో లిమిటెడ్ వారు దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. 3 కేజీలు, 4 కేజీల బాక్స్‌ల్లో వీటిని ఎగుమతి చేస్తారు. ఒక్కో బాక్స్‌లో సుమారు 7 నుంచి 9 కాయలు పట్టేలా ప్యాకింగ్ చేస్తారు. ఇక్కడ ఈ బాక్స్ విలువ రూ.450 నుంచి రూ.550 వరకు ఉంటుంది. ఈ కాయలు అమెరికాలో 57 డాలర్లకు అమ్ముతున్నారు. అంటే సుమారు రూ.4,500 పడుతుంది. 9 కాయలను రూ.4,500కు విక్రయిస్తారు. యూకేలో 21 పౌండ్ల వరకు రేటు పలుకుతోంది.

> **బాగున్నాయని చెప్పారు**
>
> మా కంపెనీ ద్వారా విదేశాలకు మామిడి కాయలు ఎగుమతి చేస్తున్నాం. రైతుల వద్ద నాణ్యత గల కాయలుంటే వాటిని బెంగళూరులో క్వాలిటీ చూసి పంపిస్తాం. ఈ ఏడాది అమెరికా, యూకేకు పంపించాం. కాయలు అద్భుతంగా ఉన్నాయని కొనుగోలు చేసిన కంపెనీ ప్రతినిధులు తెలిపారు.
>
> – వై.బాలచందర్, బీష్యూర్ అగ్రి ఎక్స్‌పోర్ట్స్, ఉలవపాడు


బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అయ్యపరెడ్డి


అయ్యపరెడ్డి



ఎన్.నాగరాజు


కేఎల్ నారాయణ


పెంచలప్రణీత్


చంద్రశేఖర్‌నాయుడు


నాగశ్రీనివాస్


పద్మాకర్

నెల్లూరు(లీగల్): ప్రతిష్టాత్మకమైన నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పి.అయ్యపరెడ్డి ఎన్నికయ్యారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం న్యాయవాదుల సంఘం ఎన్నికలు జరిగాయి. శనివారం రాత్రి 10 గంటల వరకు వచ్చిన సమాచారం మేరకు అధ్యక్షుడిగా వీసీఎస్‌ఆర్ ప్యానెల్‌కు చెందిన అయ్యపరెడ్డి తన సమీప ప్రత్యర్థి వి.ఉపేంద్రరావుపై 149 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాగా వీసీఎస్‌ఆర్ ప్యానెల్ నుంచి అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీలు గెలిచారు. న్యాయవాదుల ఐక్యవేదిక నుంచి ఉపాధ్యక్షుడు, ట్రెజరర్, జాతీయ న్యాయ వేదిక నుంచి లైబ్రరీ సెక్రటరీ గెలుపొందారు.

- ఉపాధ్యక్షుడిగా జల్లి పద్మాకర్ తన సమీప ప్రత్యర్థి ఈదూరు భాస్కరయ్యపై, జనరల్ సెక్రటరీగా నక్కల నాగరాజు తన సమీప ప్రత్యర్థి సత్తు అంకయ్యపై స్వల్ప ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. జాయింట్ సెక్రటరీగా కేఎల్ నారాయణ తన ప్రత్యర్థి ఎన్.రవికిషన్‌పై 93 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందరు. ట్రెజరర్‌గా డి.పెంచలప్రణీత్ తన సమీప ప్రత్యర్థి ఆర్.శివశంకరరావుపై 6 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా జి.చంద్రశేఖర్ నాయుడు తన సమీప ప్రత్యర్థి ఎస్‌డీ వశీంపై 170 ఓట్ల మెజారిటీతో, లైబ్రరీ సెక్రటరీగా నాగశ్రీనివాస్ తన సమీప ప్రత్యర్థి ఎండీ ముజిబుర్ రహిమాన్‌పై 83 ఓట్ల మెజారిటీతో గెలిచారు. లేడీ రెప్రజెంటేటివ్ లక్ష్మమ్మ, రమాదేవీల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా ఉంది. కార్యనిర్వాహక సీనియర్ (ఈసీ) విభాగంలో మూడు పోస్టులకు కార్యనిర్వాహక జూనియర్ (ఈసీ) విభాగంలో 5 పోస్టులకు కౌంటింగ్ కొనసాగుతోంది.

కండలేరులో 35.457 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 35.457 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 2,400, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్

సిద్దవటం: సిద్దవటం రేంజ్ పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించినట్లు రేంజర్ బి.కళావతి తెలిపారు. సిద్దవటం అటవీ శాఖ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ కడప డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని గొల్లపల్లె బీట్, సిద్దవటం బీట్, రోళ్లబోడు బీట్లలోని సమస్యాత్మక, అనుమానిత అటవీ ప్రాంతాల్లో శుక్రవారం నుంచి కూబింగ్ నిర్వహించామన్నారు. అటవీ ప్రాంతాల సమీప గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కూంబింగ్‌లో డీఆర్వో ఓబులేసు, బీట్ అధికారులు, అసిస్టెంటు బీట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తుండగా..


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ

- వ్యక్తి అరెస్ట్
- రెండు కేజీల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి తీసుకొచ్చి నెల్లూరులో విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సంతపేట పోలీసుస్టేషన్‌లో శనివారం నగర డీఎస్పీ పి.సింధుప్రియ స్థానిక ఇన్‌స్పెక్టర్ జి.దశరథరామారావుతో కలిసి నిందితుల వివరాలను వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రశాంత్ కుమార్ భోల్ కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరు నగరానికి వచ్చాడు. హరనాథపురం ఎక్స్‌టెన్షన్ ఏరియాలో నివాసం ఉంటూ ఎంబ్రాయిడరీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. అతను తన వ్యసనాలను తీర్చుకునేందుకు సరిపడా నగదు కోసం గంజాయి విక్రయాలకు తెరలేపాడు. ఒడిశా రాష్ట్రంలో కేజీ గంజాయిని రూ.5 వేల చొప్పున కొనుగోలు చేసి వాటిని చిన్ని ప్యాకెట్లుగా చేసి నెల్లూరు నగరంలో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. కొద్దిరోజులుగా సంతపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ తన సిబ్బందితో కలిసి గంజాయి విక్రయాలపై దాడులు ముమ్మరం చేశారు. అందులో భాగంగా ప్రశాంత్‌కుమార్ భోల్ శుక్రవారం ఆత్మకూరు బస్టాండ్ రైల్వే అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓ లాడ్జి ఎదురుగా గంజాయి విక్రయించేందుకు ఉన్నాడని ఇన్‌స్పెక్టర్‌కు పక్కా సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని డీఎస్పీ చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసిన ఇన్‌స్పెక్టర్, సిబ్బంది శ్రీహరి, లావణ్య కుమార్, విజయ్‌మోహన్, సుబ్బారావు, సురేంద్ర బాబు తదితరులను ఎస్పీ అభినందించారు.

నాగలింగేశ్వర స్వామి ఆలయ పరిశీలన


ఆలయం వద్ద మంత్రి రామనారాయణరెడ్డి

ఆత్మకూరు: చేజర్ల మండలంలోని పెన్నానది ఒడ్డున పెరుమాళ్లపాడు గ్రామ సమీపంలో ఏడు దశాబ్దాల క్రితం ఇసుకలో పూడిపోయిన నాగలింగేశ్వర స్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించారు. శనివారం ఆత్మకూరు పట్టణంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన సాయంత్రం ఆలయాన్ని సందర్శించారు. గుడికి సుమారు 300 సంవత్సరాల చరిత్ర ఉంది. 70 ఏళ్ల క్రితం ఉధృతంగా వచ్చిన వరదలకు ఇసుక ఆలయాన్ని పూడ్చివేసింది. అప్పటి నుంచి పూజా కార్యక్రమాలకు దూరమైంది. ఈ నేపథ్యంలో 2020లో స్థానిక యువకుల చొరవ తీసుకుని ఆలయాన్ని వెలుగులోకి తెచ్చారు. కొంతమేర ఇసుక మేటను తొలగించారు. దీనిని పరిశీలించిన మంత్రి మాట్లాడుతూ జిల్లాకే తలమానికంలాంటి చరిత్ర కలిగిన ఆలయంలో పూర్తి స్థాయిలో ఇసుకను తొలగించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పునఃనిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆయన వెంట దేవదాయ శాఖ అధికారులు, సోమశిల ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ వి.కేశవచౌదరి, శ్రీనివాసులునాయుడు, బూదళ్ల వీర రాఘవ రెడ్డి తదితరులున్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు


చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు ఆపిన టిప్పర్

తడ: తమిళనాడు వైపు తరలిపోతున్న ఇసుక టిప్పర్‌ను శనివారం బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద నున్న పోలీసు ఔట్‌పోస్ట్ సిబ్బంది పట్టుకున్నారు. కూటమి పెద్దల నుంచి ఒత్తిడి రావడంతో పట్టుకున్న కొద్దిసేపటికే వదిలేశారు. సూళ్లూరుపేట నుంచి 12 టైర్ల టిప్పర్ సుమారు 50 టన్నుల ఇసుక తీసుకుని బీవీపాళెం మీదుగా తమిళనాడుకు బయలుదేరింది. తనిఖీ కేంద్రం వద్ద సిబ్బంది పరిశీలించి అదుపులోకి తీసుకున్నారు. మీడియా సిబ్బంది అక్కడ ఉండటాన్ని గమనించిన పోలీసులు టిప్పర్‌ని పక్కన పెట్టించారు. కొంత సమయం గడిచే సరికి టిప్పర్ అక్కడ కనిపించకుండా పోయింది. బడా నాయకుడు ఫోన్ చేయడంతో పోలీసులు వదిలేసినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. 22 టన్నుల కెపాసిటీ కలిగిన ఈ టిప్పర్‌లో రెండింతలు ఇసుక నింపి పట్టలు కప్పి యథేచ్ఛగా తరలిస్తుండడం గమనార్హం. ఆంధ్రా నుంచి తమిళనాడుకు అక్రమ రవాణాను కట్టడి చేసేందుకు బీవీపాళెం పాత చెక్‌పోస్టు వద్ద తనిఖీ కేంద్రం ఏర్పాటు చేశారు.